RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

| హైదరాబాద్ | శుక్రవారం, జూన్ 26, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 65 | పేజీలు: 8 | వెల : రూ.1 |
|---|---|---|---|---|---|---|



## రిటైర్మెంట్ తర్వాత సీఎస్‌కు కీలక పదవి.. 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఎండీగా నియామకం?

## కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ నాశనం



హైదరాబాద్, జూన్ 25 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్

**(మిగతా 2వ పేజీలో)**



# నదుల అనుసంధానంతోనే ప్రగతి

### తుంగభద్ర గేట్లు ప్రారంభించిన ముగ్గురు సీఎంలు

బెంగళూరు, జూన్ 25 : రాజకీయాల్లో అత్యంత అరుదైన, దక్షిణాది జలవనరుల చరిత్రలోనే ఒక అపూర్వ మైలురాయిగా నిలిచే చారిత్రాత్మక ఘట్టానికి కృష్ణానది ఉపనది అయిన తుంగభద్ర వేదికైంది. కర్ణాటకలోని విజయనగర జిల్లా హోసపేట సమీపంలో గల మునిరాబాద్ వద్ద తుంగభద్ర జలాశయానికి పూర్తిగా పునరుద్ధరించిన 33 నూతన స్పిల్‌వే క్రస్ట్ గేట్లను గురువారం ఘనంగా జాతికి అంకితం చేశారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కలిసి సంయుక్తంగా ఈ గేట్లను ప్రారంభించారు. గతంలో చోటుచేసుకున్న జల విపత్తును సవాల్‌గా తీసుకుని, మూడు రాష్ట్రాల సమన్వయంతో రికార్డు సమయంలో దాదాపు రూ. 51 కోట్ల వ్యయంతో ఈ ఆధునిక గేట్ల మార్పిడి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.గేట్ల ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలు ఒకే వేదికపైకి రావడం చారిత్రాత్మక అంశమన్నారు. "తుంగా పానం.. గంగా స్నానం" అనే సామెతను గుర్తు చేస్తూ, తుంగభద్ర నీరు అంత పవిత్రమైనదని కొనియాడారు. గతేడాది 19వ గేట్ కొట్టుకుపోయినప్పుడు నిపుణుడు కన్నయ్య నాయుడు ద్వారా స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీరు వృధా కాకుండా కాపాడామని, ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు కలిసి పనిచేసి మొత్తం 33 గేట్లను మార్చడం అభినందనీయమన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తగ్గుతున్న తరుణంలో నదుల అనుసంధానమే దేశానికి అన్‌స్టాపబుల్ వృద్ధిని ఇస్తుందని, ప్రధాని మోదీ నేతృత్వంలో

**(మిగతా 2వ పేజీలో)**



## ఉద్యోగులకు రేవంత్ బంపర్ ఆఫర్

హైదరాబాద్, జూన్ 25 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 14 బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ఒప్పందాలపై సంతకాలు చేసి పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత అని చెప్పారు. ఉద్యోగులు అడగక ముందే ప్రభుత్వం ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.ప్రమాద బీమా కింద ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు కవరేజీ లభిస్తుందని

**(మిగతా 2వ పేజీలో)**



వాయిస్ ఆఫ్ ప్రజలు

శుక్రవారం, జూన్ 26, 2026

# నదుల అనుసంధానంతోనే ప్రగతి

వన్ నేషన్ – వన్ గ్రిడ్ లాగే గోదావరి–కావేరి అనుసంధానం ద్వారా దక్షిణాది రాష్ట్రాల రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ కేవలం ఒక టెక్నికల్ విజయం మాత్రమే కాదని, మూడు రాష్ట్రాల కరువు జిల్లాల సమస్యల పరిష్కారానికి పడిన కీలక అడుగని అభివర్ణించారు. ఏపీలోని కర్నూలు, అనంతపురం , తెలంగాణలోని మహబూబ్‌నగర్ ప్రజల వలసల బాధలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రాష్ట్రాల మధ్య జల వివాదాల పంచాయతీలు పక్కనబెట్టి, కేవలం రైతుల శ్రేయస్సు కోసమే సమస్యలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు చట్టబద్ధంగా రావలసిన 10 టీఎంసీల నీరు ఇంకా రావడం లేదని ప్రస్తావిస్తూ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ కింద ఉన్న తెలంగాణ రైతులకు న్యాయం జరిగేలా కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు సహకరించాలని కోరారు. వివాదాలు వీడి పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే అంతిమంగా రైతులకు మేలు జరుగుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**రైతాంగానికి రక్షణ కవచం.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ హర్షం**

ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్యామ్ నిర్మించిన 70 ఏళ్ల తర్వాత తొలిసారిగా పాత గేట్ల స్థానంలో హై–గ్రేడ్ స్టీల్ గేట్లను అమర్చామని తెలిపారు. గతేడాది ప్రమాదం జరిగినప్పుడు కేవలం పాత గేటుకు ప్యాచ్ వర్క్ చేయకుండా, భవిష్యత్ తరాల భద్రతను దృష్టిలో ఉంచుకుని మొత్తం 33 గేట్లను మార్చేలా అంతరాష్ట్ర సమన్వయంతో బోర్డు నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ నూతన గేట్ల ఏర్పాటుతో రాబోయే సీజన్‌లో పూర్తి స్థాయిలో 105 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు జలాశయం సురక్షితంగా సిద్ధమైందన్నారు. కర్ణాటకలో 9 లక్షల ఎకరాలు, ఏపీలో 6 లక్షల ఎకరాలు, తెలంగాణలో 87 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సుస్థిరమైన సాగునీరు అందుతుందని, నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పూడికతీత అంశాలపై కూడా మూడు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు.



**దక్షిణాది రాష్ట్రాల ఐక్యత దేశానికే ఆదర్శం: కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్**

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ జల వనరుల నిర్వహణలోను, అంతరాష్ట్ర సమస్యల పరిష్కారంలోనూ ఏపీ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు చూపిన చొరవ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, యూపీ–ఎంపీల మధ్య 'కెన్–బెత్వా' ప్రాజెక్ట్ తరహాలోనే దక్షిణాదిలోనూ గోదావరి–కృష్ణా–కావేరి అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. మూడు రాష్ట్రాల రైతుల నీటి హక్కులను కాపాడుతూ, తాగునీటి ఎద్దడిని నివారించడమే లక్ష్యంగా కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్రాలకు పూర్తి సాంకేతిక, ఆర్థిక మద్దతును అందిస్తుందని భరోసా ఇచ్చారు.

# ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు అంకురార్పణ.. ఈసారి 69 అడుగుల రూపం!

**పంచముఖ సంకటహర గణపతిగా దర్శనమివ్వనున్న వినాయకుడు**

**ఇరువైపులా సోమనాథ్, కాళికామాత రూపాలు**

**పర్యావరణ హితంగా మట్టితో భారీ విగ్రహం నిర్మాణం**

**నిర్మాణ పనుల్లో 100 మందికిపైగా కళాకారులు**




ఖైరతాబాద్ మహాగణపతి నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. నిర్జల ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ఉదయం గణేశ్ మండపం వద్ద శాస్త్రోక్తంగా కర్ర పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంతో విగ్రహ నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. 72వ వసంతంలోకి అడుగుపెడుతున్న ఈ ఉత్సవాల సందర్భంగా.. ఈ ఏడాది ఏర్పాటు చేయనున్న విగ్రహ నమూనా పోస్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సంవత్సరం ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ స్వామివారు 'శ్రీ పంచముఖ సంకటహర మహాగణపతి' అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పూర్తి పర్యావరణహితంగా మట్టితో 69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో ఈ భారీ విగ్రహాన్ని తీర్చిదిద్దనున్నారు. ఐదు పడగల ఆదిశేషుని నీడలో, ఎనిమిది చేతులతో పద్మాసనంపై ఆసీనుడై ఉండేలా విగ్రహాన్ని రూపొందిస్తారు. స్వామివారి ఐదు ముఖాలు పంచభూతాలకు ప్రతీకగా నిలవనున్నాయి. ఈసారి విగ్రహానికి ఇరువైపులా ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేస్తున్నారు. కుడివైపు 20 అడుగుల ఎత్తులో ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం నమూనా, ఎడమవైపు అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన కాళికామాత రూపం కొలువుదీరనున్నాయి. సెప్టెంబర్ 14న వినాయక చవితి ఉండటంతో వచ్చే 82 రోజుల్లో విగ్రహ నిర్మాణం పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ పర్యవేక్షణలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన 100 మందికి పైగా కళాకారులు ఈ పనుల్లో పాల్గొంటారు. 1954లో అడుగు ఎత్తుతో ప్రారంభమైన ఖైరతాబాద్ గణపతి ప్రస్థానం ఈ స్థాయికి చేరడం విశేషమని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

# లంచం కేసులో చిక్కిన తహసీల్దార్.. రూ. 5 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు!

**లంచం కేసులో పట్టుబడ్డ షామీర్‌పేట తహసీల్దార్ సుచరితపై మరో కేసు**

**ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు తేలడంతో కేసు నమోదు చేసిన ఏసీబీ**

**సోదాల్లో రూ. 5.05 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించిన అధికారులు**

**నెల క్రితం 2 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సుచరిత**



లంచం కేసులో అరెస్టయి సస్పెన్షన్‌కు గురైన షామీర్‌పేట మాజీ తహసీల్దార్ టి. సుచరిత మెడకు మరో ఉచ్చు బిగుసుకుంది. ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల (డీఏ) కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన నెల రోజులకే ఈ కొత్త కేసు నమోదు కావడం గమనార్హం. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా షామీర్‌పేట మండలంలో తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, జాయింట్ సబ్–రిజిస్ట్రార్‌గా పనిచేసిన సుచరిత, ఆమె డ్రైవర్ వి. నగేష్‌ను మే 26, 2026న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 30 ఎకరాల వ్యవసాయ భూమికి నాలా (చీజ) మార్పిడి కోసం ఒక వ్యక్తి నుంచి ఎకరాకు లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ. 30 లక్షలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా రూ. 2 లక్షలు ముడుపులు తీసుకుంటుండగా అధికారులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అవినీతి ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై జూన్ 25న సుచరితపై ఏసీబీ అధికారులు అక్రమాస్తుల కేసు నమోదు చేశారు. ఆమె నివాసంతో పాటు ఇతర మూడు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో భారీగా ఆస్తులు బయటపడ్డాయి. అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిలో రూ. 12 లక్షల నగదు, రూ. 1.2 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు ఉన్నాయి. వీటితో పాటు బ్యాంకు ఖాతాల్లో రూ. 38 లక్షలు, ఒక వోక్స్‌వ్యాగన్, ఒక హ్యుందాయ్ క్రెటా కార్లు, హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, కీసర, ఖానామెట్ గ్రామాల్లో రెండు ప్లాట్లు, సిద్దిపేట జిల్లా దమ్మరకుంట గ్రామంలో వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు 5.05 కోట్లు రూపాయలుగా ఉంటుంది. లంచం కేసు తర్వాత సస్పెన్షన్‌కు గురైన సుచరితపై తాజాగా నమోదైన అక్రమాస్తుల కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.

## రిటైర్మెంట్ తర్వాత సీఎస్‌కు కీలక పదవి.. 'ఇన్వెస్ట్ తెలంగాణ' ఎండీగా నియామకం?

**తెలంగాణలో 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో కొత్త ఏజెన్సీ ఏర్పాటు**

**రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం**

**ఏజెన్సీ ఎండీగా రామకృష్ణారావు నియమితులయ్యే అవకాశం**

**పదవీ విరమణ తర్వాత ఆయన సేవలను వినియోగించుకోవాలని సర్కార్ యోచన**

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఏజెన్సీని ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం**



రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను భారీ స్థాయిలో ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ఒక ప్రత్యేక పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) నియమితులయ్యే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నూతన ఏజెన్సీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేయడం, సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడం వంటివి ఈ ఏజెన్సీ ప్రధాన విధులుగా ఉండనున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇందులో ఒక 'ఇన్వెస్ట్ సెల్'ను కూడా ఏర్పాటు చేయనున్నారు. గత మే నెలలో ఐటీ, పరిశ్రమల శాఖలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పెట్టుబడుల ఆకర్షణలో దూకుడుగా వ్యవహరించేందుకు తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ ఏజెన్సీకి ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో పాటు, కీలక రంగాలకు వేర్వేరుగా డైరెక్టర్లను నియమించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన కె. రామకృష్ణారావు జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆర్థిక, పరిపాలనా రంగాల్లో ఆయనకు ఉన్న అపార అనుభవాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే ఆయనకు ఎండీ బాధ్యతలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారుగా నియమించే అంశంపై కూడా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ నాశనం

చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# ఉద్యోగులకు రేవంత్ బంపర్ ఆఫర్

తెలిపారు. విమాన ప్రమాదాల సందర్భంలో బ్యాంకులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా రక్షణ అందిస్తాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు.ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు. పీఆర్సీ విషయంలో ఇచ్చిన హామీని కూడా తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలమని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతమని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని విమర్శించిన సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా తొలి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ఉద్యోగులు ప్రతిరోజూ అదనంగా గంట పనిచేయాలని కోరారు. వచ్చే అదనపు ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం రాజకీయ అంశాలపైనా స్పందించిన సీఎం తాను "గుంపు మేస్త్రీ"నని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే తన బృందానికి నాయకత్వం వహిస్తున్నానని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

## భారత్‌కు లాభం ఉంటేనే అమెరికాతో ట్రేడ్ డీల్: పీయూష్ గోయల్

**అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు**

**భారత్‌కు ప్రత్యేక ప్రయోజనం ఉంటేనే ఒప్పందం**

**భారత ఉత్పత్తులకు అమెరికా మార్కెట్లో ప్రాధాన్యం కోరుతున్న భారత్**

**50% సుంకాలను 18%కు తగ్గించే అంశంపై చర్చలు**

**ఇతర దేశాల కంటే భారత్‌కు మెరుగైన అవకాశాలు కావాలని డిమాండ్**



అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల కంటే భారతీయ ఉత్పత్తులకు ప్రత్యేక ప్రయోజనం లభించని పక్షంలో అగ్రరాజ్యంతో ఎలాంటి ఒప్పందంపై సంతకం చేయబోమని స్పష్టం చేశారు. లండన్ పర్యటనలో మాట్లాడిన ఆయన భారత ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో ప్రత్యేక అవకాశాలు కల్పించేలా చట్టపరమైన, విధానపరమైన వ్యవస్థను అమెరికా రూపొందించాల్సి ఉందన్నారు. ఆ అంశం ఖరారయ్యే వరకు ఒప్పందం కుదరదని తేల్చిచెప్పారు. భారత్–అమెరికా మధ్య జరుగుతున్న చర్చల్లో దిగుమతి సుంకాల తగ్గింపు కీలక అంశంగా మారింది. గతంలో భారత ఉత్పత్తులపై దాదాపు 50 శాతం వరకు ఉన్న సుంకాలను 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన ఆధారంగా చర్చలు సాగాయని గోయల్ వెల్లడించారు. అలా జరిగితే భారత ఉత్పత్తులకు ఇతర దేశాల కంటే అమెరికా మార్కెట్లో ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చల అనంతరం కూడా ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. అయితే పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై ఇంకా తుది నిర్ణయం రాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో మధ్యంతర వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు మొదలైనప్పటి నుంచి ఇది మూడో విడత చర్చలు కావడం విశేషం.

## పాస్‌పోర్ట్ ఫీజుల భారీ పెంపు.. జూలై 1 నుంచి కొత్త ధరలు

**సాధారణ పాస్‌పోర్ట్‌పై రూ.1000 నుంచి రూ.1500 వరకు పెంపు**

**తత్కాల్, మైనర్ల పాస్‌పోర్ట్ రుసుముల్లో కూడా గణనీయమైన మార్పులు**

**నిర్వహణ ఖర్చులు పెరగడమే కారణమన్న విదేశాంగ శాఖ**




పాస్‌పోర్ట్ జారీకి సంబంధించిన రుసుములను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. సవరించిన ధరలు 2026 జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ మేరకు జూన్ 20న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పాస్‌పోర్ట్ సేవల నిర్వహణ ఖర్చులు పెరగడంతో సుదీర్ఘ విరామం తర్వాత ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాజా సవరణల ప్రకారం, సాధారణ కేటగిరీలో 36 పేజీల అడల్ట్ పాస్‌పోర్ట్ ఫీజు రూ.1,500 నుంచి రూ.2,500కి (67 శాతం పెంపు) పెరిగింది. అదేవిధంగా, 60 పేజీల పాస్‌పోర్ట్ రుసుము రూ.2,000 నుంచి రూ.3,500కి (75 శాతం పెంపు) చేరింది. తత్కాల్ స్కీమ్ కింద 36 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.5,000, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇక 18 ఏళ్లలోపు మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్ట్ ఫీజును రూ.1,750గా నిర్ణయించారు. పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నా లేదా పాడైపోయినా తిరిగి పొందేందుకు అయ్యే రీప్లేస్‌మెంట్ ఖర్చులను కూడా గణనీయంగా పెంచారు. సాధారణ విధానంలో 36 పేజీల పాస్‌పోర్ట్ రీప్లేస్‌మెంట్‌కు రూ.5,000, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.6,000 చెల్లించాలి. వీటినే తత్కాల్ విధానంలో పొందాలంటే వరుసగా రూ.7,500, రూ.8,500 ఖర్చవుతుంది. కాగా, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) ఫీజును రూ.750గా ఖరారు చేశారు. ప్రస్తుతం పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌లో పాత రుసుములే కనిపిస్తున్నప్పటికీ, జూలై 1 నుంచి కొత్త ధరలు వర్తిస్తాయి. అయితే పాస్‌పోర్ట్ కాలపరిమితిలో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు. పెద్దలకు 10 ఏళ్లు, మైనర్లకు 5 ఏళ్ల పాటు పాస్‌పోర్ట్ చెల్లుబాటు కానుంది.

# స్కూల్ జోన్‌లో భారీ గుంతను పూడ్చిన జాయింట్ యాక్షన్ కమిటీ జనరల్ సెక్రటరీ గండ్ర కమలాకర్ పటేల్



నాగారం, జూన్ 25 (వాయిస్ టుడే) : నాగారం ప్రాంతంలోని స్కూల్ జోన్ పరిధిలో ఉన్న భారీ గుంత కారణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు ప్రమాదాలకు కారణమవుతున్న ఈ గుంతను గమనించిన జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) జనరల్ సెక్రటరీ గండ్ర కమలాకర్ పటేల్ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్వయంగా ముందుకొచ్చి గుంతను పూడ్చడం జరిగింది. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే అని, కానీ స్పందన లేకపోవడంతో, ముఖ్యంగా స్కూల్ పిల్లల భద్రత కోసం సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

విద్యార్థుల భద్రత కోసం, ప్రమాదాల నివారణ కోసం, సురక్షితమైన రహదారుల కోసం ఆయన చేసిన ఈ చర్య ప్రజా సేవ పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. ప్రశ్నించడం మాత్రమే కాదు, అవసరమైతే చేతల్లో పని చేసి ప్రజలకు అండగా నిలవడమే నిజమైన ప్రజా సేవ అని నిరూపించాడు. నాగారం ప్రాంతంలోని దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను జాయింట్ యాక్షన్ కమిటీ ఈ సందర్భంగా డిమాండ్ చేస్తుందని అన్నారు. ప్రజల కోసం, ప్రజల భద్రత కోసం, జాయింట్ యాక్షన్ కమిటీ పిల్లల ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదని అందుకే ప్రమాదం జరగకముందే గుంతను పూడ్చడం జరిగిందని తెలిపారు.



## నల్ల పోచమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ జూన్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్ పోచమ్మ బస్తి లో ఉన్న నల్ల పోచమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు స్థానిక కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అమ్మవారి కళ్యాణం సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ ఆ పోచమ్మ తల్లి కృపా కటాక్షాలు, ఆశీర్వచనలు ప్రజలందరిపై ఉండాలని అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు, ఇంత ఘనంగా నిర్వహించి ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆ అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బుచ్చి రెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ గౌడ్, సంధ్య, మహేందర్ రెడ్డి, పూలమ్మ, సుగ్రీవుడు, శ్రీకాంత్, మహేందర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి సమస్య పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ జూన్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మహిళలు మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వానించారు.

## మారేడుపల్లి CGM వినోద్ కుమార్‌కు వినతిపత్రం



నాచారం (వాయిస్ టుడే):మారేడుపల్లి CGM వినోద్ కుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. మాణికేశ్వర్ నగర్‌లో 7 టెంపుల్ ప్రాంతంలో బోర్‌వెల్ సమస్య మరియు మాణికేశ్వర్ నగర్‌లో నెలకొన్న తాగునీటి సరఫరా సమస్యలను మరియు డ్రైనేజీ సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి, వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్, గండికోట వెంకటేష్ , వరికుప్పల రవి పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి మారేడుపల్లి CGM వినోద్ కుమార్ సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



## నాగారం, రాంపల్లి ఆల్ కాలనీల సమస్యలు పరిష్కారించాలి

### ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం అందజేసిన ఆల్ కాలనీల ప్రతినిధులు

నాగారం, జూన్ 25:-(వాయిస్ టుడే): నాగారం, రాంపల్లి 'ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్' ప్రతినిధులు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని గురువారం కలిసి నాగారం మరియు రాంపల్లి కాలనీలకు సంబంధించిన వివిధ పెండింగ్ ప్రజా సమస్యలపై చర్చించారు. మా సమస్యలను ఎమ్మెల్యే ఓపికగా విన్నారు. నాగారం మరియు రాంపల్లికి సంబంధించిన పెండింగ్ సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మా ప్రాంత అభివృద్ధి మరియు సంక్షేమం పట్ల మల్లారెడ్డి చూపిస్తున్న మద్దతు, ప్రోత్సాహం మరియు సానుకూల హామీకి మేము హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.సమస్యలు పరిష్కారమయ్యే వరకు అసోసియేషన్ వాటిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని, మేము గమనిస్తున్నాం మని, మేము వింటున్నామని, ప్రతి కాలనీ కోసం మేము ఇక్కడ ఉన్నామని కాలనీల ప్రతినిధులు పేర్కొన్నారు. మెరుగైన నాగారం మరియు రాంపల్లి కోసం అందరం కలిసి పనిచేస్తమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. నాగారం, రాంపల్లి ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజేటి వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్, సి హెచ్. సాయినాథ్ గౌడ్, ఉపాధ్యక్షుడు, సి హెచ్. దేవి వర ప్రసాద రావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు, కోశాధికారి, టి. రామ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భాస్కర్, కమిటీ సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, హనుమంత రావు, రాఘవ రావు తదితరులు పాల్గొన్నారు.

# వడ్లకొండ దివ్యకు ఓయూ నుంచి డాక్టరేట్

నాచారం (వాయిస్ టుడే):"సంక్షేమ రాష్ట్రంలో మహిళలు: అవగాహన, సవాళ్లు, ప్రభావాలు –తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన గ్రామీణ – పట్టణ ప్రాంతాలపై ఒక అధ్యయనం." అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ డిపార్ట్ మెంట్ నుంచి డాక్టర్ రామ్ షెఫర్డ్ భీనవేణి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినందుకు గాను వడ్లకొండ దివ్య కు ఓయూ పరీక్షల విభాగం డాక్టరేటును ప్రకటించింది. ఓయూ నుంచి బీఎస్సీ ఎంఈసి గ్రూపుతో బ్యాచిలర్ డిగ్రీ చదివిన దివ్య ఎం ఏ సోషియాలజీ కోర్సు పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించింది. యు జి సి నెట్ పరీక్ష ద్వారా జే ఆర్ ఎఫ్ సాధించి ఫెలోషిప్ ద్వారా తన పీహెచ్డీని పూర్తి చేసింది. ప్రస్తుతం వడ్లకొండ దివ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖలో విస్తరణ అధికారి (Extension Officer)గా పనిచేస్తున్నారు. ఈ పరిశోధన ద్వారా సంక్షేమ పథకాల అందుబాటు మరియు మహిళల నిజమైన సాధికారత మధ్య



ఉన్న అంతరాన్ని సమగ్రంగా విశ్లేషించింది. ఈ పరిశోధనలో ఒక ముఖ్యమైన సైద్ధాంతిక ఆవిష్కరణగా "అన్‌కాన్షస్ ఎంపవర్‌మెంట్" (Unconscious Empowerment) అనే భావనను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం, అనేక మంది మహిళలు పని చేయడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం, సంక్షేమ పథకాల ప్రయోజనాలను వినియోగించడం ద్వారా సాధికారతను పొందుతున్నప్పటికీ, తమను తాము సాధికారులుగా స్పష్టంగా గుర్తించకపోవడం జరుగుతోంది . ఈ పరిశోధన ఫలితాలు మహిళల సంక్షేమం మరియు సాధికారతకు సంబంధించిన విధాన రూపకల్పనలోనూ, భవిష్యత్ పరిశోధనలలోనూ ఉపయోగపడతాయని పరిశోధకులు భావిస్తున్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణానికి చెందిన వడ్లకొండ స్నేహలత, వెంకట్ రావు దంపతుల కుమార్తె వడ్లకొండ దివ్య. ఓయూ నుంచి డాక్టరేట్ సాధించడం పట్ల బంధువులు, మిత్రులు వడ్లకొండ దివ్య ను అభినందించారు.




## మారుతి సుజుకి విక్టోరీస్ కొత్త కారును ప్రారంభించిన మధుయాష్కి గౌడ్

ఎల్‌బినగర్, జూన్ 25(వాయిస్ టుడే ): కర్మాన్‌ఘాట్‌లోని మారుతి సుజుకి ఆదర్శ ఆటోమోటివ్స్ షో రూమ్ లో నూతనంగా మార్కెట్లోకి తీసుకువచ్చిన 'విక్టోరీస్' కారును టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గురువారం ముఖ్యఅతిథిగా హాజరై లాంచ్ చేశారు. ఆధునిక ఫీచర్లతో విక్టోరిస్ కార్ ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు షోరూం నిర్వాహకులు వివరించారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్లోకి వచ్చే కార్లకు మంచి ఆదరణ లభిస్తుందని ఈ సందర్భంగా మధుయాష్కి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంపాపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్ , గణేష్ నాయక్, నాయకులు దేరంగుల కృష్ణ, రామకృష్ణారెడ్డి , గణేష్ రెడ్డి , రమాకాంత్ , పూల నాగరాజు , నరేష్ గుప్తా , కొండోజు శ్రీనివాస్, అంతటి శ్రీనివాస్ గౌడ్ , శశికాంత్ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ జూన్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ పరిధిలోని కైసర్ నగర్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం ( ఎస్ ఐ ఆర్ ) ను స్థానిక మున్సిపల్ ఉప కమిషనర్ వెంకట రాములు కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని తెలిపారు. ప్రజలు బీఎల్‌ఓల ద్వారా అందించే ఎన్యుమరేషన్ ఫారమ్ ను సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఘనంగా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్ జూన్25(వాయిస్ టుడే): బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి తన కార్యాలయంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నాడు... ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్మికులు, అలాగే ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు,నియోజకవర్గ నాయకులు, మీడియా మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి కార్మికలు, మరియు మీడియా మిత్రులు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు... స్థానిక కార్మికులు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండే కార్మిక నాయకుడు రవి ఎలప్పుడు కార్మికులకు కష్టమొచ్చిన నేనున్నా అంటూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేదాకా వురుకునే ప్రసక్తే లేదని ముందుండి మా కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న రవి కి మరొకసారి పుట్టినరోజు శుభాకాంక్షలు అని తెలిపారు.. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కుటుంబ సభ్యులతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ నల్ల పోచమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ జగన్

కుత్బుల్లాపూర్ జూన్ 25(వాయిస్ టుడే ): 125 డివిజన్ గాజులరామారం పరిధిలోని దేవేందర్ నగర్ లో శ్రీ నల్ల పోచమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ జగన్ 125 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డి.విజయ్ రామ్ రెడ్డి అడ్వకేట్ కమలాకర్ ఈ కార్యక్రమంలో చెట్ల వెంకటేష్ పూలమ్మ వినోద చందన ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## చీర్యాలలో సర్ పత్రాలు పంపిణీ చేసిన బిఎల్ఓలు

నాగారం, జూన్ 25:-(వాయిస్ టుడే): చీర్యాల గ్రామంలో ఓటర్ల పరిశీలనలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరిగే ప్రక్రియ గురువారం ప్రారంభం అయ్యింది. సర్ ప్రక్రియ గురించి ప్రతి ఓటర్లకి ఎన్నుమరేషన్ ఫామ్స్ అందజేసారు. 2022 నుండి ఓటు వేసిన వారికి ప్రూఫ్ లేకుండా ఎన్నుమరేషన్ ఫామ్ ని ఫిల్ చేసి ఇవ్వాలని, 2004 నుండి ఓటు వేసిన వారి తల్లిదండ్రులది మరియు ఓటు వేసిన వ్యక్తి ప్రూఫ్ ఇవ్వాలని ఓటర్ల కు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్, బిఎల్ఓలు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో ఐదు ప్రత్యేక రిటైల్ దుకాణాలను ప్రారంభించిన యూరోగ్రిప్

యూరోగ్రిప్ టైర్స్, టీవీఎస్ శ్రీచక్ర లిమిటెడ్‌కు చెందిన భారతదేశ ప్రముఖ ద్విచక్ర మరియు త్రిచక్ర వాహన టైర్ బ్రాండ్, తెలంగాణలోని హైదరాబాద్‌లో ఐదు కొత్త ప్రత్యేక రిటైల్ దుకాణాలను ప్రారంభించినట్లు ఈరోజు ప్రకటించింది . వీటిలో మూడు స్టోర్లను హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సహకారంతో వారి వ్యాపార భాగస్వామి ద్వారా ఫ్రాంచైజీ చేయబడ్డాయి. ఈ నూతన స్టోర్ల ప్రారంభం, భారతదేశవ్యాప్తంగా యూరోగ్రిప్ టైర్స్ తన రిటైల్ విస్తరణ వ్యూహాన్ని కొనసాగిస్తున్నట్లు సూచిస్తోంది. వీటి ద్వారా సంస్థ తన మార్కెట్ ఉనికిని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, కస్టమర్లకు సమగ్ర టైర్ మరియు ద్విచక్ర వాహన సంరక్షణ సేవలను ఒకే చోట అందించాలనే తన నిబద్ధతను మరోసారి చాటుతోంది. ఈ మిలాన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మిస్టర్ టి.కె.రవి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, టీవీఎస్ శ్రీచక్ర లిమిటెడ్ మాట్లాడుతూ,




## కుత్బుల్లాపూర్‌లో విలువైన ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారుల ఫెన్సింగ్

### ప్రభుత్వ స్థలాన్ని రక్షించిన అధికారులకు అభినందనలు : నల్ల జయశంకర్ గౌడ్

కుత్బుల్లాపూర్ జూన్ 25(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పెదబషీర్‌బాద్ గ్రామం, సర్వే నెం. 23లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని రక్షించేందుకు రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేయడంపై నల్ల జయశంకర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.100 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం స్వాగతించదగ్గ విషయమన్నారు. గత 15 నెలలుగా ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం తాము నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని కోరుతూ వివిధ స్థాయిల్లో ఫిర్యాదులు చేసినట్లు పేర్కొన్నారు.

మార్చి 2026లో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ (ఎంఆర్వో) హైడ్రాకు లేఖ రాయడం, అలాగే ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణ ప్రయత్నాలపై అదనపు కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఆ ఫిర్యాదుల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ ఎంఆర్వో రాజేష్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని గుర్తించి, ఈరోజు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, గత 15 నెలలుగా పలుమార్లు ఎంఆర్వో, కలెక్టర్ కార్యాలయాలకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. అలాగే, స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు, మిగిలిన స్థలాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, కుత్బుల్లాపూర్ ప్రాంతంలో గతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బలరాం, ఎల్లస్వామి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## SIR డ్రైవ్‌లో చురుకుగా ఎస్ సీనియర్ నాయకురాలు మురారి స్మిత కోటేష్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే):సికింద్రాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. పద్మరావు గౌడ్ మార్గదర్శకత్వంలో.. బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకురాలు మురారి స్మిత కోటేష్ గౌడ్ గురువారం ప్రత్యేక సమిష్టి పునర్విమర్శ (SIR) డ్రైవ్‌లో చురుకుగా పాల్గొని. దీూా అఖిలతో కలిసి, మురారి స్మిత కోటేష్ గౌడ్ తార్నాక డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి SIR ఫారాలను పంపిణీ చేసి, ఓటరు గుర్తింపు వివరాలను ధృవీకరించారు. మరియు నివాసితులకు వారి ఓటరు సమాచారాన్ని నమోదు చేసుకోవడంలో, సరిదిద్దుకోవడంలో కాలనీ వాసులకు వివరించారు.



## మాదకద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ భద్రతపై అవగాహన కార్యక్రమం

సికింద్రాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బేగంపేట్ పోలీసుల ఆధ్వర్యంలో టివోలీ సమీపంలోని వాగ్దేవి పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన త్రిముల్గిరి ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వల్ల యువత, కుటుంబాలు, సమాజంపై పడే తీవ్ర ప్రభావాలను వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, మంచి అలవాట్లు అలవరచుకుని విద్యపై దృష్టి సారించాలని సూచించారు. రహదారి నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, బాధ్యతాయుత డ్రైవింగ్, పాదచారుల భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా ట్రాఫిక్ భద్రతపై చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, వాగ్దేవి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆసక్తిగా కార్యక్రమంలో పాల్గొని పోలీసు అధికారులతో పరస్పర చర్చలు జరిపారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రతిజ్ఞ చేశారు. సురక్షితమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని సంకల్పించారు.

## ఓయూ రసాయన శాస్త్ర విభాగంలో అక్రమాలపై విచారణ జరపాలి: ఏఐఎస్ఎఫ్



సికింద్రాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థుల డిజైన్ సెమినార్ల నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, అవకతవకలపై ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈమెరకు గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, రసాయన శాస్త్ర విభాగంలో డిజైన్ సెమినార్ నిర్వహించకుండానే ఒక పీహెచ్‌డీ విద్యార్థికి పూర్వ తేదీతో సెమినార్ నివేదిక జారీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ వ్యవహారంలో కొందరు ఉన్నతాధికారులు, విభాగానికి చెందిన బాధ్యుల ప్రమేయం ఉన్నట్లు సమాచారం అందిందని ఆరోపించారు. డిజైన్ సెమినార్లు పూర్తి చేయని సుమారు 80 మంది పరిశోధక విద్యార్థులను తదుపరి విద్యా ప్రక్రియలకు అనుమతించకపోయినప్పటికీ, ఒక విద్యార్థికి ప్రత్యేక మినహాయింపు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ అంశంపై విశ్వవిద్యాలయ ఉపకులపతి తక్షణమే స్పందించి నిష్పాక్షిక విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ, రసాయన శాస్త్ర విభాగంపై వస్తున్న ఆరోపణలు ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగం జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోపణలపై పారదర్శకంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని, లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఉప్పల ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి ఆశ్వన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో చిన్నారి రియాన్సిపై వీది కుక్కల దాడి



యాదగిరిగుట్ట (వాయిస్ టుడే): మంగళవారం జూన్ 23న ఉదయం సెలవుదినం కావడం తో పిల్లలు ఆడుకుంటుండగా చిన్నారి రియాన్సిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అదే పాపపై దాడి చేసిన కుక్క అప్పటికే సంవత్సరం క్రితం నుండి కోతుల తో గాయపడి పిచ్చి గా ప్రవర్తిస్తూ ఉండేది అని దారిన పోయే వాహనదారుల నీ కూడా దాడి చేసిందని కాలని వాసులు తెలియజేశారు. కౌన్సిలర్ కర్రె ప్రవీణ్ సహకారం తో మున్సిపాలిటీ సిబ్బంది కుక్క ను తీసుకెళ్లారు. కానీ ముగ్గురు ఇంటి యజమానులు మాత్రం కుక్కని విడిచి పెట్టాలని కోరారు. పిల్లలు ఇంట్లో ఉండాలని కుక్క మాత్రం వీధుల్లోనే ఉంటుంది అని మూడు రోజులుగా ఘర్షణకి దిగడం గమనార్హం, బాధితుల కుటుంబం కీర్తన, వీరచారి పేద వారినైనా మాకు న్యాయం చేయాలని కోరారు. పిల్లలు ప్రజల ఆరోగ్యం ముఖ్యం కానీ వీళ్ళకి వీధి కుక్క తో ఏం అవసరం అనేది సమస్యగా మారింది అని వాపోయారు.

## ఇంద్ర పార్క్ వద్ద సర్పంచ్‌ల నిరసన -- ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్



హైదరాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ) : ఇంద్ర పార్క్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాభివృద్ధిలో తమకు కూడా సముచిత అవకాశం కల్పించాలని, గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో కలిసి వంద శాతం సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో తమ పాత్రను గుర్తించి, శిలాఫలకాలపై తమ పేర్లను కూడా పొందుపరచాలని వారు కోరారు. గ్రామ ప్రజల సేవ కోసం ఎన్నికైన సర్పంచ్‌లుగా తమకు తగిన గౌరవం, గుర్తింపు దక్కాలని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, తమ డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, రేపటిలోగా స్పష్టమైన ఫలితం రావాలని నిరసనకారులు విజ్ఞప్తి చేశారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని వారు అభిప్రాయపడ్డారు.



## ఘనంగా జీహెచ్‌ఎంసీ సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు

సికింద్రాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): చిక్కడపల్లిలోని వివేక్‌నగర్ పార్క్‌లో నిర్వహించిన జీహెచ్‌ఎంసీ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. రుద్రమదేవి షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో మాస్టర్ నారాయణ నిర్వహించిన ఈ సమ్మర్ క్యాంప్‌లో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ హాజరై, సమ్మర్ క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండర్ ఎన్. లక్ష్మి, సినీ ఇండస్ట్రీకి చెందిన మాస్టర్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడా శిక్షకులు, నిర్వాహకులను శాలువాలతో సన్మానించారు. సినీనటి ఇంద్రజ, పలువురు ప్రముఖ నటులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు, క్రీడాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి అవును చెప్పండి

### వ్యతిరేక అవగాహనపై ఓయూ పోలీసుల ర్యాలీ

సికింద్రాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం రైల్వే జూనియర్ కళాశాల విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ సీతాఫల్మండి, రవీంద్రనగర్, పార్థి బస్తీ ప్రాంతాల మీదుగా కొనసాగి తిరిగి కళాశాలకు చేరుకుంది. సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీలో ఇంటింటికి వెళ్లి డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓయూ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. స్నేహితుల ఒత్తిడి లేదా ఆసక్తి కారణంగా డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని సూచించారు.

హైదరాబాద్ సిటీ పోలీస్ చేపడుతున్న "సే నో టు డ్రగ్స్... సే ఎస్ టు లైఫ్" ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ వినియోగం, నిల్వ, విక్రయం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908, డయల్ 100, నార్కోటిక్స్ హెల్ప్‌లైన్ 8712697708, లేదా వాట్సాప్ నంబర్ 9490666111కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జయచందర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## జెనరిక్ మందుల వినియోగంపై అవగాహన పెంచాలి

### గాంధీ మెడికల్ కాలేజీ జెనరిక్స్ ఫర్ ఆల్' సదస్సులో నిపుణులు

సికింద్రాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలంటే జెనరిక్ మందుల వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని వైద్య, ఫార్మా రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్ లోని గాంధీ మెడికల్ కాలేజీ మినీ ఆడిటోరియంలో వారధి ట్రస్ట్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'జెనరిక్స్ ఫర్ ఆల్' సదస్సులో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఇందిర, ఎం. ఆనందం అండ్ కో డైరెక్టర్ ఎం. రవీంద్ర విక్రమ్ మాట్లాడుతూ, వైద్యం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే హక్కు కావాలని పేర్కొన్నారు. జెనరిక్ మందుల నాణ్యత, ప్రయోజనాలపై వైద్య విద్యార్థులు, వైద్యులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రోగులపై ఆర్థిక భారం తగ్గించే దిశగా జెనరిక్ ప్రిస్క్రిప్షన్లను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సదస్సులో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ సీఈఓ దీపక్ సప్రా, నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యులు డాక్టర్ సంతోష్ కుమార్ క్రలేటి, ఫార్మా రంగ నిపుణులు వరుణ్ విహార్, శివకుమార్ బాలకృష్ణన్, గాంధీ జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ జలగం తిరుపతిరావు, యశోద ఆస్పత్రి ఆంకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సుధా సిన్హా పాల్గొని జెనరిక్ మందుల సమర్థత, వాటి ప్రాముఖ్యతపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా జన ఔషధి కేంద్రాల విస్తరణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, జెనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించే విధానాలను ప్రభుత్వం అమలు చేయాలని నిపుణులు సూచించారు. వారధి ట్రస్ట్ చైర్మన్ కట్టమూరి సుబ్బారావు మాట్లాడుతూ, తెలంగాణ ఆరోగ్య శాఖ సహకారంతో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో 'వారధి జెనరిక్ అవుట్‌లెట్లు' ఏర్పాటు చేసేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రజల్లో జెనరిక్ మందులపై అవగాహన పెంచేందుకు భవిష్యత్తులో మరిన్ని సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. సదస్సులో వైద్యులు, ఫార్మా నిపుణులు, వైద్య విద్యార్థులు, ఆరోగ్య రంగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నాం...

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి...

### ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించే ఎంఓయూలపై టీజీఈజేఏసీ హర్షం...



సికింద్రాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో వివిధ బ్యాంకులతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ ఎంప్లాయీస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) స్వాగతించింది. ఈ మేరకు టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 14 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబాలకు ఈ నిర్ణయం గొప్ప భరోసా కల్పిస్తుందని వారు పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతుండటం అభినందనీయమన్నారు.

**ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నాం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కార బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. తాను కూడా మధ్యతరగతి కుటుంబం నుంచే వచ్చిన వ్యక్తినని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. ప్రజాసేవే ప్రభుత్వ ప్రతినిధులు, ఉద్యోగులందరి ఉమ్మడి లక్ష్యమని పేర్కొన్నారు. సింగరేణిలో అమలు చేసిన బీమా పథకం ద్వారా మరణించిన 45 మంది కార్మికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించామని సీఎం గుర్తు చేశారు. గతంలో వేతనాల చెల్లింపులు ఆలస్యమయ్యేవని, ప్రస్తుతం ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లింపులను వేగవంతం చేశామని, రానున్న రెండు నెలల్లో రూ.4,000 కోట్ల బకాయిలను పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్న సీఎం, రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, ముజీబ్ హుస్సేన్, బి. శ్యామ్, సదానంద్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, గజేందర్, కృష్ణమూర్తి, వెంకట్ రెడ్డి, మోహన్ నారాయణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

---

# ఓయూ రసాయన శాస్త్ర విభాగంలో డిజైన్ సెమినార్ల నిర్వహణలో అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీ వేయాలి

### అధికార దుర్వినియోగనికి పాల్పడ్డ ప్రొఫెసర్లపై కఠిన చెర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలి

### ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఓయు కార్యదర్శి లెనిన్ డిమాండ్



హైదరాబాద్, జూన్ 25: ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్.డి. పరిశోధక విద్యార్థుల డిజైన్ సెమినార్ల నిర్వహణలో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చాయని, రసాయన శాస్త్ర విభాగంలో డిజైన్ సెమినార్ల నిర్వహణలో అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీ వేసి, కమిటీ నివేదిక ప్రకారం అధికార దుర్వినియోగనికి పాల్పడ్డ ప్రొఫెసర్లపై కఠిన చెర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఓయు కార్యదర్శి ఐ.లెనిన్ లు డిమాండ్ చేసారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్.డి. పరిశోధక విద్యార్థుల డిజైన్ సెమినార్ల నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు మరియు అధికార దుర్వినియోగం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఓయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. కృష్ణంరాజు పర్యవేక్షణలో ఉన్న ఒక పీహెచ్.డి. విద్యార్థికి డిజైన్ సెమినార్ నిర్వహించకుండానే పూర్వ తేదీతో (గ్రాతీవ-ష్ఫీవ) డిజైన్ సెమినార్ నివేదిక జారీ చేసారని, ఈ ప్రక్రియకు రసాయన శాస్త్ర విభాగాధిపతి, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ మరియు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు ప్రొఫెసర్ విజ్జులత, అలాగే రసాయన శాస్త్ర విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ మరియు ఎంఎంటీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్, విషయ నిపుణుడు ప్రో. సక్ రామ్ సహకరించినట్లు తెలిసిందన్నారు. డిజైన్ సెమినార్లు పూర్తి చేయని లేదా సమర్పించని సుమారు 80 మంది పీహెచ్.డి. విద్యార్థులను కట్ ఆఫ్ డేట్ పేరుతో తదుపరి విద్యా ప్రక్రియలకు అనుమతించకపోయినప్పటికీ, ఒక ప్రత్యేక విద్యార్థికి అనుచితంగా మినహాయింపు ఇవ్వటం ఏమిటని అయన ప్రశ్నించారు. ఒక విద్యార్థికి ప్రత్యేకంగా అనుమతి ఇవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయని, ఓయూ వైస్ ఛాన్సలర్ తక్షణమే జోక్యం చేసుకొని అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపి ఆరోపణలు నిజమైతే అక్రమాలకు పాల్పడ్డ ప్రొఫెసర్లను సస్పెండ్ చేయాలనీ పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేసారు. లెనిన్ మాట్లాడుతూ ఓయూ రసాయన శాస్త్ర విభాగంలో జరిగిన అక్రమాలు దేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరుగాంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్టను దెబ్బతిస్తున్నాయన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారాన్ని దుర్వినియోగం సిగ్గుచేటన్నారు. ఓయూ రసాయన శాస్త్ర విభాగంపై వచ్చిన ఆరోపణలపై నిష్పాక్షికమైన, సమగ్రమైన విచారణను నిర్వహించి వాస్తవాలను వెలికితీసి, ఆరోపణలు నిజమని తేలిన పక్షంలో, సంబంధిత ప్రొఫెసర్లపై కఠిన చెర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ పోరాటాలు తీవ్రతరం చేస్తుందని ఐ. లెనిన్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు ఉప్పల్ ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి ఆశ్వన్ కుమార్, ఉపాధ్యక్షులు దొంది రామ్, నేతలు సుమన్, మధు తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలం.. ఓటర్ల హక్కులను కాపాడాలి

### టిఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇంచార్జ్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు



హైదరాబాద్, జూన్ 25: ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకోవడంతో పాటు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, బి ఎల్ వో లు చురుకుగా పాల్గొని, ప్రజల ఓటు హక్కుల రక్షణే ధ్యేయంగా పనిచేయాలని టీఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జ్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పిలుపు నిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఓటర్లకు అత్యంత కీలకమైనదని తెలిపారు. ఓటరు జాబితాలో ఇప్పటికే పేర్లు ఉన్నవారు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారంను పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని సూచించారు. ఫారం సమర్పించని పక్షంలో ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓటరు జాబితా పరిశుభ్రత, పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఫారాలను అందజేస్తారని, ప్రజలు వారికి పూర్తి సహకారం అందించాలని కోరారు. అవసరమైన వివరాలు, గుర్తింపు పత్రాలు, కుటుంబ సభ్యుల సమాచారం తదితరాలను సమగ్రంగా అందించాలని సూచించారు.

ప్రత్యేకించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని 19వ సంవత్సరంలోకి ప్రవేశించిన యువత తమ పేర్లను తప్పనిసరిగా ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో యువత పాత్ర అత్యంత కీలకమని, ప్రతి యువ ఓటరు తన హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని అన్నారు. ఓటు హక్కు కేవలం వ్యక్తిగత హక్కు మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే బాధ్యత కూడా అని నడిపెల్లి వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నిర్ణీత గడువులోపు సమర్పించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 31 లక్షల 59 వేల 307 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటికే 82.02 శాతం మ్యాపింగ్ పూర్తయిన నేపథ్యంలో మిగిలిన ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించి ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాలు, వార్డులు, బూత్ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రజల ఓటు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాల ప్రకారం ప్రజలకు సహకారం అందించాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం కావడం ఎంతో అవసరమని, ఈ కార్యక్రమంలో ప్రజలు, అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కోరారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల కానున్న నేపథ్యంలో ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సకాలంలో సమర్పించాలని లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

---



## ఉప సర్పంచులపై చెక్ పవర్ ఆరోపణలు ఖండించాలి

### తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం

సికింద్రాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): చెక్ పవర్ విషయంలో ఉప సర్పంచులపై వస్తున్న ఆరోపణలను వెంటనే ఖండించాలని తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో తమ హక్కులు, గౌరవాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కార్తీక్ మాట్లాడుతూ.. ఉప సర్పంచులకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం, వార్డు సభ్యులకు రూ.3,000 గౌరవ వేతనం కల్పించాలని కోరారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే శిలాఫలకాలపై సర్పంచులతో పాటు ఉప సర్పంచుల పేర్లను తప్పనిసరిగా పొందుపరచాలని, ఆయా వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై సంబంధిత వార్డు సభ్యుల పేర్లను కూడా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పాత్ర కీలకమని, వారికి తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని ఫోరం నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో అధికార ప్రతినిధి లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సప్న, వైస్ ప్రెసిడెంట్ కవిత, శ్రీధర్ గౌడ్, మహేష్, పాషా, రాజు, రమేష్, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మురళీధర్ దేశ్‌పాండే మృతిపై ప్రభుత్వం స్పందించాలి

### కళాకారుల డిమాండ్

సికింద్రాబాద్, జూన్ 25 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ ఉద్యమ కళాకారుడు, సకల కళల జాక్ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే మృతిపై ప్రభుత్వం మౌనం వీడి స్పందించాలని కళాకారులు, ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంస్మరణ సభలో పలువురు వక్తలు హాజరై మాట్లాడారు. సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కళాకారులను ఏకం చేసి కీలక పాత్ర పోషించిన మురళీధర్ దేశ్‌పాండేకు ప్రభుత్వం కనీసం అధికారిక నివాళి కూడా అర్పించకపోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రాష్ట్రంలోని ఉద్యమ కళాకారులకు గుర్తింపు కార్డులు, నెలకు రూ.6,000 పింఛన్ అందించాలని కోరారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అధికారిక సంస్మరణ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన కళాకారులు మురళీధర్ దేశ్‌పాండే చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు, నాయకులు ప్రఫుల్ రామ్ రెడ్డి, సుల్తాన్ యాదగిరి, విష్ణు కిషోర్, కొండూరు భాస్కర్, డప్పు స్వామి, గుంటి చంద్రయ్య, కోల జనార్ధన్, వి. సుభాష్ చంద్రబోస్, అంబాల నారాయణ గౌడ్, దండు సారంగపాణి, డోలక్ యాదగిరి, మంచాల వెంకటస్వామి, రాఘవేంద్ర స్వామి, అడ్వకేట్ ప్రతాప్, దమ్మిగారి కనకయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

### ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహా నాయక్



హైదరాబాద్, జూన్ 24: రిజర్వేషన్ పేరు మీద గిరిజన ఓట్లను దండుకోవడం కోసం బస్సు యాత్ర పెట్టడం సిగ్గుచేటు అని ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహా నాయక్ అన్నారు. బస్సు యాత్ర సందర్భంగా గురువారం ఉదయం నరసింహా నాయక్ ను ఆయన ఇంటి దగ్గర పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. లంబాడీలకు రిజర్వేషన్ కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చినట్టుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా రావలసినటువంటి రిజర్వేషన్ ను కల్పించడం జరిగింది కానీ, కాంగ్రెస్ పార్టీ ఏదో లంబాడి జాతిని ఉద్ధరించినట్టుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాముల నాయక్, ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న శంకర్ నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ వారి నియోజకవర్గం, లంబాడీల అభివృద్ధి కోసం ఏమీ అభివృద్ధి చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి, సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
శుక్రవారం 26 జూన్ 2026



## హబ్సిగూడ డివిజన్లో ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం

ఉప్పల్ జూన్ 25 :హబ్సిగూడ డివిజన్ పరిధిలోని బూత్ నెంబర్ 249 గ్యాన్ భారతి హై స్కూల్ పరిధిలో ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లకు ఫామ్ 6 పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఇంచార్జ్ ఉప కమిషనర్ శైలజ, రామ్ రెడ్డి, బూతు బిఎల్ఓ శివ, భారతీయ జనతా పార్టీ శక్తి కేంద్రం ఇంచార్జ్ జిల్లాల రవీందర్ రెడ్డి, హబ్సిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి బిఎల్ఓ2 చింతకింది ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకొని కొత్త ఓటర్ నమోదు వివరాల సవరణ మరియు ఓటు హక్కు ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.



## మాజీ ఎంపీ వినోద్ కుమార్ కుమారుడి వివాహానికి హాజరైన ఆర్ వి మహేందర్

హైదరాబాద్ : జూన్ 25(వాయిస్ టుడే): గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ గోషామహల్ ఇంచార్జి ఆర్ వి మహేందర్ నియోజకవర్గం నాయకులు జాన్వాడ సమీపంలోని కే కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను కలిసి ఆశీర్వదించిన నాయకులు, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకలో పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఈ వేడుకలో పాల్గొని మాజీ ఎంపీ వినోద్ కుమార్ కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది.



## కూకట్‌పల్లి సర్కిల్-52లో ఎస్ఐఆర్ -2026 సర్వేను పరిశీలించిన ఈఆర్ఓ మయాంక్ సింగ్ (ఐఏఎస్ )

కూకట్‌పల్లి: జూన్ 25(వాయిస్ టుడే): ఈఆర్ఓ -046 కేపిసి మరియు కూకట్‌పల్లి జోన్ జోనల్ కమిషనర్ అయిన మయాంక్ సింగ్ (ఐఏఎస్) కూకట్‌పల్లి సర్కిల్-52 పరిధిలోని కూకట్‌పల్లి, బాలాజీ నగర్ వార్డులలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ -2026 సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎఈఆర్ఓ -046 కేపిసి మరియు డిప్యూటీ కమిషనర్ జి. ఆంజనేయులు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ డి. ఉదయ్ కుమార్, బిఎల్ఓ సూపర్‌వైజర్ మరియు టాక్స్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

తనిఖీ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ లు)తో మయాంక్ సింగ్ మాట్లాడి, క్షేత్రస్థాయి పనుల పురోగతిని సమీక్షించారు. సర్వేను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని, సేకరించే సమాచారం ఖచ్చితంగా మరియు సమగ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి వివరాలను నమోదు చేయాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ -2026 ప్రక్రియను పూర్తి చేయాలని బిఎల్ఓ లకు ఆదేశించారు.

ఎస్ఐఆర్ -2026 సర్వే సమర్థవంతమైన అమలును నిర్ధారించడం, సమాచార నాణ్యతను మెరుగుపరచడం, క్షేత్రస్థాయి ధృవీకరణలో ఉన్నత ప్రమాణాలను పాటించడం ఈ తనిఖీ ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ పరిశీలన ద్వారా సర్వే ప్రక్రియ మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా కొనసాగేందుకు అవసరమైన సూచనలు అందించబడ్డాయి.

# సమస్యల పై పోరాటానికి సిద్ధం: కల్వకుంట్ల కవిత

**ఘనంగా అంబర్ పేటలో టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగ**

**యువత రాజకీయాల్లోకి రావాలి**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి**

**పేద బడుగు బలహీన వర్గాలకు అండగా మేమున్నాం**



హైదరాబాద్ జూన్ 25(): అంబర్ పేట నియోజకవర్గంలో మహంకాళి దేవాలయం ఎదురుగా టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత చేతుల మీదుగా జెండా ఎగురవేయడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రవీణ్ ముదిరాజ్ ఇంచార్జ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పెద్ద ఎత్తులో నిర్వహించారు. అంబర్ పేట నియోజకవర్గం నాయకులు అభిలాష్ గౌడ్ మరియు హైమద్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రానున్న రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎలక్షన్లో టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని, బడుగు బలహీన వర్గాలకు అండగా మేమున్నామని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజా సమస్యలపై పోరాటానికి మేము ఎప్పుడు సిద్ధంగా ఉన్నామని, యువత రాజకీయాల్లోకి రావాలని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని ముఖ్యంగా ఉచిత విద్య ఉచిత వైద్యం సామాజిక తెలంగాణ రైతుల సమస్యలపై పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ బహుదూర్ పుర ఇంచార్జ్ సోను భాయ్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కంటెస్టెడ్ ఎమ్మెల్యే నందాల అనిల్ కుమార్, రాజు, నిఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి సరఫరా, వినియోగ నిర్మూలనే లక్ష్యంగా నార్కోటిక్ జాగిలాలతో విస్తృత తనిఖీలు




సిరిసిల్ల, జూన్ 25 (వాయిస్ టుడే); యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్ లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణం లో గురువారం నార్కోటిక్ డాగ్ సహాయం తో కిరాణా దుకాణాలు, పాన్ షాప్‌లు, బస్టాండ్ , విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, జిల్లా లో గంజాయి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడు తోందన్నారు. అందు లో భాగంగా పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు, బస్టాండ్ లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయం తో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, వాటి దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111 కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.



## బహుజన వర్గాల రాజకీయ సాధికారత సమరభేరికి అన్ని వర్గాల ప్రజలు ఊ మద్దతు ఇవ్వాలి : అఖిల్ పాషా

కరీంనగర్,జూన్ 25(వాయిస్ టుడే): జులై 05న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ప్రజలను కోరారు.కరీంనగర్‌లోని జమాతే ఇస్లామీ హింద్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు షోహెబ్ అహ్మద్ ఖాన్ ను కమిటీ సభ్యులను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా రాజ్యాధికార సమరభేరి సభ లక్ష్యాలు,బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ వర్గాల రాజకీయ సాధికారత,సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికార సాధన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేస్తున్న ఉద్యమం గురించి వివరించారు.ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాలకు రాజకీయ అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు.బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ వర్గాల ఐక్యతతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భువనగిరిలోనిర్వహించే రాజ్యాధికార సమరభేరి సభ బహుజన వర్గాల ఆశయాలను ప్రతిబింబించే చారిత్రాత్మక సభగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా,మైనారిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్షత్ బిన్ అలీ, మహిళా ప్రధాన కార్యదర్శి ఇశ్రత్ శావాలి, నాయకులు మహబూబ్ అలీ, స్వరూప పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే కీలకం

**ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత కీలకమైనది**

**మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ ప్రత్యక్షంగా పరిశీలన**



హనుమకొండ, (వాయిస్ టుడే) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమైన హక్కు అని..ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు నమోదును నిర్ధారించుకోవాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్ – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) గురువారం ప్రారంభమైన సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 50వ డివిజన్ జులైవాడ 117వ బూత్ పరిధిలో బీఎల్‌వో మణికంఠా రెడ్డితో కలిసి పోలీస్ కాలనీలోని ఓటర్లను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి ఆంజనేయులు అనే ఓటరుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ద్వారా ఖచ్చితమైన సమాచారం ఆధారంగా ఓటరు జాబితా సిద్ధమవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే పార్టీ తరఫున బీఎల్ఏ లను నియమించామని,వారు బూత్ స్థాయిలో ఓటర్లను కలుస్తూ అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ మ్యాపింగ్ దాదాపు పూర్తయిందని..అయితే హనుమకొండ వంటి పట్టణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొంత క్లిష్టంగా మారిందని పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్నామని అన్నారు. అయినప్పటికీ ఎన్నికల కమిషన్,బీఎల్‌వో లకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. భారతదేశం ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్న దేశమని,ప్రజలు తమ ప్రతినిధులను ఓటు హక్కు ద్వారా ఎన్నుకుంటారని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఓటు భారతీయుల ప్రాథమిక హక్కు అని,ప్రతి ఓటరు 2002 ఓటరు జాబితా ప్రకారం తన ఓటును మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. డబుల్ ఓటర్లు,మరణించిన వారి పేర్లు తొలగించి,అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా,కొత్త ఓటర్లను సైతం నమోదు చేసే విధంగా బీఆర్ఎస్ పార్టీ,పార్టీ నియమించిన బీఎల్‌వో లు పనిచేస్తున్నారని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే డివిజన్ల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 50వ డివిజన్ మాజీ అధ్యక్షుడు కోటేశ్వర్ రావు,5వ డివిజన్ మాజీ అధ్యక్షుడు పున్నం చందర్,నాయకులు ఇమాముద్దీన్,మూటిక రాజు యాదవ్,మల్లారెడ్డి,ప్రసాద్,సంపత్ పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

**వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి**

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఎల్లారెడ్డిపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ**

రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 25 (వాయిస్ టుడే)! సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ఔట్ పేషెంట్ రిజిస్టర్, ల్యాబ్, మందులు ఇచ్చే గది, ఇన్ పేషెంట్ వార్డు పరిశీలించి రోగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని పేర్కొన్నారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యాక్సినేషన్ వంద శాతం పూర్తి చేయాలని, గర్భిణు లకు క్రమం తప్పకుండా అన్ని పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..



# జూన్ 25 భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత చీకటి రోజు

**ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన యోధులను మరువలేం**

**ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన కరీంనగర్ పోరాట యోధులను సన్మానించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



కరీంనగర్, జూన్ 25(వాయిస్ టుడే): భారత ప్రజాస్వామ్య చరిత్రలో జూన్ 25వ తేదీ అత్యంత భయానకమైన 'చీకటి రోజు'లాంటిదని,అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం,ప్రధాని ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి దేశంలో ఎమర్జెన్సీ విధించి విధ్వంసాన్ని సృష్టించిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో ఎమర్జెన్సీ దినోత్సవ వేడుకలను బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడి,జైలు శిక్షను అనుభవించిన పోరాట యోధులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి,ప్రోగ్రాం కన్వీనర్ మేకల ప్రభాకర్ యాదవ్,బిజెపి నాయకులు కార్యకర్తలు కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 1975 జూన్ 25న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం,ప్రధాని విధించిన అత్యవసర పరిస్థితి భారత దేశానికి గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. స్వతంత్ర భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం అన్నారు.ఎమర్జెన్సీ సందర్భంగా నాటి పాలకుల అహంకారంతో అత్యంత దారుణంగా ప్రజాస్వామ్యాన్ని రద్దు చేసి రాజ్యాంగాన్ని వారికి కావలసిన విధంగా మార్చుకొని,దేశవ్యాప్తంగా లక్షలాది మంది నాయకులు, కార్యకర్తలను జైళ్లలో బంధించి, పత్రికా స్వేచ్ఛను హరించి,ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాశారన్నారు.ముఖ్యంగా ఎన్నికల్లో అక్రమాలు పాల్పడినందుకు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగన్మోహన్ లాల్ సిన్హా ఆ రోజుల్లో ఇందిరాగాంధీని పదవి నుంచి దిగిపోవాలని ఆదేశించిందని, ఎన్నికల్లో పాల్గొనకుండా ఆరేళ్లపాటు నిషేధం విధించిందన్నారు.ఆ తీర్పును జీర్ణించుకోలేకనే ఇందిరాగాంధీ దేశంలో అత్యవసర పరిస్థితి విధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఇన్ని దారుణాలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజాస్వామ్యం ఆపదలో ఉందని చెప్పడం హాస్యాస్పదంగా, విడ్డూరంగా ఉందన్నారు.అందుకే జూన్ 25 అనేది భయానకమైన చీకటి రోజు అని,ఆ కాలంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన యోధుల త్యాగాలను మనం ఎప్పటికీ మరువలేమన్నారు.నేటి యువతకు, భావితరాలకు అప్పటి దారుణ పరిస్థితులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని,ఆ దిశలోనే బిజెపి ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఎమర్జెన్సీ దినోత్సవ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు,ప్రోగ్రాం కన్వీనర్ మేకల ప్రభాకర్ యాదవ్,పార్లమెంట్ కన్వీనర్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు కళ్ళెం వాసుదేవ రెడ్డి,కన్నా కృష్ణ,సీనియర్ నాయకులు గుజ్జశ్రీనివాస్ రావు,పుప్పాల రఘు, అలివెల్లి సమ్మి రెడ్డి,కార్పొరేటర్ బండ రమణ రెడ్డి,అనిల్,అడిచెర్ల రాజు, మండల అధ్యక్షులు బండారి గాయిత్రి,తనుకు సాయికృష్ణ, రవీందర్,దాసరి రమణారెడ్డి, ఈసంపల్లి మహేష్ తిరుమల్ రెడ్డి, వంగల ఆంజనేయులు,వాసు పాల్గొన్నారు.

## తన హత్యాయత్నం వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోండి

**సీపీకి కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ఫిర్యాదు**



కరీంనగర్, జూన్ 25(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ 29వ డివిజన్ కార్పొరేటర్,బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు ప్రసాద్ తనపై జరిగిన హత్యాయత్నంపై సమగ్ర విచారణ జరిపి,అసలు సూత్రధారులను కనిపెట్టి కఠినంగా శిక్షించాలని కోరుతూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశారు.కిసాన్ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను అక్రమ కబ్జాదారుల నుండి కాపాడేందుకు తాను చేస్తున్న కృషి వల్లే,కబ్జాకోరులకు తాను టార్గెట్‌గా మారానని సోమిడివేణు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుండటంతో, ఓర్వలేని వ్యక్తులు తనపై కక్ష పెంచుకున్నారని ఆయన ఆరోపించారు.ఈ హత్యాయత్నానికి సంబంధించి పోలీసులు ఇప్పటికే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నప్పటికీ,వారు తనకు పూర్తిగా అపరిచితులని,వారిపై ఎటువంటి వ్యక్తిగత కక్షలు లేవని కార్పొరేటర్ తెలిపారు.వారు స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్పొరేటర్ భర్త అయిన బాలరాజు అనుచరులని తనకు సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు.భూ కబ్జాల విషయంలో తాను చేస్తున్న పోరాటాన్ని అడ్డుకునేందుకు బాలరాజు తన అనుచరుల ద్వారా పక్కా ప్లాన్ ప్రకారం ఈ దాడి చేయించారని,దీనిపై లోతైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.తాజా సంఘటన నేపథ్యంలో తన ప్రాణాలకు తీవ్ర ముప్పు ఉందని, భవిష్యత్తులో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని వేణు ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధిగా ప్రజాసేవలో ఉన్న తనను కాపాడాలని,తనకు తక్షణమే పోలీసు భద్రత కల్పించాలని ఆయన సీపీని కోరారు. తెర వెనుక ఉండి కుట్రలు పన్నిన అసలైన దోషులను చట్టం ముందు నిలబెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## సామాజిక సేవలో కాకతీయ కమ్మ సేవా సమితి ఆదర్శంగా నిలవాలి

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

కోదాడ, జూన్25 (వాయిస్ టుడే ప్రతినిధి): కాకతీయ కమ్మ సేవా సమితి సామాజిక సేవలో ఆదర్శంగా నిలవాలని ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. కాకతీయుల కాలం నుంచే కమ్మ సామాజిక వర్గం చారిత్రాత్మక ప్రాధాన్యతను సంతరించుకుందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి సేవా సంస్థలు కీలకంగా పనిచేయాలని, ముఖ్యంగా పేద మరియు బలహీన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు. సేవా కార్యక్రమాలు, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలు, సామాజిక సంక్షేమ చర్యల ద్వారా సమాజానికి మరింత సేవ చేయాలని పిలుపునిచ్చారు. కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందించిన మంత్రి, ఈ భవనం సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగే విధంగా సేవా సమితి కార్యక్రమాలు కొనసాగాలని సూచించారు. అనంతరం సమితి బాధ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సమితి నాయకులు, సభ్యులు, దాతలు, ప్రముఖులు పాల్గొన్నారు.



## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కరీంనగర్, జూన్ 25(వాయిస్ టుడే): అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల శారీరక,మానసిక సమస్యలు తలెత్తుతాయని,యువత "డ్రగ్స్‌కు నో చెప్పి,జీవితానికి యెస్ చెప్పాలి" అని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు రూపొందించిన కార్డ్స్ "మాదకద్రవ్యాలకు నో చెప్పండి -- జీవితానికి యెస్ చెప్పండి", "డ్రగ్స్ మన జీవితాలకు శత్రువులు", "ఆరోగ్యకరమైన యువతే దేశ భవిష్యత్తు" వంటి నినాదాలతో అవగాహన కార్యక్రమం కొనసాగింది. విద్యార్థులందరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ ఏ సి ఓ బి సంపత్ కుమార్ ఏవో బి శ్రవణ్ కుమార్ ప్రోగ్రాం అధికారులు డి సాగర్ ఏం. మహేష్ ఎన్. శ్రీనివాస్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశంలో 23వ ర్యాంకు సాధించిన ఓద్యారం పాఠశాల

**గర్వంగా ఉందన్న ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం**

**రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఓద్యారం విజయయాత్రకు ఎమ్మెల్యే అభినందనలు**



కరీంనగర్, జూన్ 25(వాయిస్ టుడే): చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలానికి చెందిన జడ్పీహెచ్ఎస్ ఓద్యారం ఎస్ ఎచ్ వి ఆర్ 2025-26 జాతీయ స్థాయి రేటింగ్‌లో దేశంలో 23వ ర్యాంకు, తెలంగాణలో 5వ ర్యాంకు సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం తన క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం గంగాధర మండలానికే కాకుండా మొత్తం చొప్పదండి నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్తుకు పట్టుకొమ్మల వంటివని,ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు.2017-18లో పాఠశాల రాష్ట్ర స్థాయి అవార్డు సాధించినప్పుడు కూడా తాను ఎంతో సంతోషించానని,ఇప్పుడు అదే పాఠశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.ఒక చిన్న గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయమని కొనియాడారు. జడ్పీహెచ్ఎస్ ఓద్యారం ఉపాధ్యాయులు,విద్యార్థులు, తల్లిదండ్రులు,గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. పరిశుభ్రత,పచ్చదనం,పర్యావరణ పరిరక్షణ,నాణ్యమైన విద్య అందించడంలో పాఠశాల చూపుతున్న కృషి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేసి,భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల ప్రతినిధులు పాల్గొన్నారు.



## అభివృద్ధితో పాటు నగర ప్రజల భద్రతకు పెద్దపీట

**మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్, జూన్ 25(వాయిస్ టుడే): నగరంలో ప్రజలకు మౌలిక సదుపాయాల అభివృధితో పాటు నగర ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తామని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.58వ డివిజన్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ నిర్మించనున్న కాంపౌండ్ వాల్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా నగర అభివృద్ధితో పాటు ప్రజల భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కూడా నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు.అనంతరం నగరంలోని 33వ డివిజన్‌లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్,కార్పొరేటర్లు సర్దార్ రవీందర్ సింగ్,చంద్ర,హీనా ఆఫ్రీన్, కో-ఆప్షన్ సభ్యులు నందకుమార్, బల్బీర్ సింగ్, ఎం.డి.ముజీబ్, మున్సిపల్ అధికారులు,పోలీస్ సిబ్బంది,ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌లో పాల్గొని పర్యవేక్షించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**మ్యాపింగ్ కాని కొత్త ఓటర్లను నమోదు చేపించాలి**

కరీంనగర్, జూన్ 25(వాయిస్ టుడే): ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నగరంలోని 47 వ డివిజన్ లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని పర్యవేక్షించారు.అసలైన ఓటరు ఏ ఒక్కరికి అన్యాయం జరుగవద్దని మ్యాపింగ్ కాని ఓటర్ల నమోదుతో పాటు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ బిఎల్ఏలు దగ్గరుండి చూసుకోవాలని మ్యాపింగ్ అయిన వారి ఎన్యుమరేషన్ పత్రాలు దగ్గరుండి నింపించి బిఎల్ వో ద్వారా అప్ లోడ్ చేపించాలి అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఎన్యూమరేషన్ ఫామ్ నింపించి ఇవ్వకపోతే డ్రాఫ్ట్ లిస్ట్ లో ఓటు నమోదు కాదు అందుకని తప్పకుండా ప్రతి ఎన్యూమరేషన్ ఫామ్ తప్పకుండా నింపించి ఇవ్వాలని బిఎల్ ఏ లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్,బిఎల్ వో సునీత,బిఎల్ వో సూపర్ వైజర్ జమున,శ్రీనివాస్ గౌడ్,కేశవ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



## ఎన్యూమరేషన్ ఫారం స్వీకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి దంపతులు

మానకొండూర్, జూన్ 25(వాయిస్ టుడే):ఎమ్మెల్యే డాక్టర్ కమ్మంపల్లి సత్యనారాయణ తన స్వగ్రామం పచ్చునూరులో ఎన్యూమరేషన్ పారాన్ని అధికారుల నుంచి తీసుకున్నారు.గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (సర్) నిర్వహించిన సందర్భంగా ఆయన తన సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధతో కలిసి ఎంఆర్వో, బీఎల్ఏలు,బీఎల్‌వోల నుంచి ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడు భాగస్వామి కావాలని,తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు,చేర్పులు చేసుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన బాధ్యతను గుర్తించి ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.అనంతరం అధికారులు, బీఎల్ఏలు, బీఎల్‌వోలతో కార్యక్రమం నిర్వహణపై వివరాలు తెలుసుకుని, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు.

## ఎస్ఐఅర్ ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చెయ్యాలి

**పస్తపూర్‌లో స్థానిక కౌన్సిలర్ శ్రీధర్ రెడ్డి తో కలిసి తహేసీల్దార్ తనిఖీ**



ఝరాసంగం, జూన్ 25 (వాయిస్ టుడే) : జహీరాబాద్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా శాసన సభ పరిధి పట్టణంలోని పస్తపూర్ లో భాగమైన 3 వ వార్డులో గురువారం నాడు ప్రారంభమైన ఎస్ఐఅర్ ప్రక్రియను మండల తాహేసీల్దార్ పత్లోత్ దశరథ్ స్థానిక 3 వ వార్డు కౌన్సిలర్ గంకటి శ్రీధర్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. అనంతరం వార్డు బిఎల్ఓ లకు కీలకమైన సూచనలు ఇస్తూ కచ్చితమైన్ సమాచారంతో సమగ్రమైన సమాచారాన్ని ఒకటికి మూడుసార్లు పరిశీలించుకోవాలని, ప్రతి ఓటర్ ఇంటింటికి వెళ్లి 100 శాతం ప్రక్రియను అయ్యే విధంగా చూడాలని, దీని కోసం స్థానిక కౌన్సిలర్, అధికార యంత్రంగం సహకారంతో ముందుకు వెళ్లాలని సూచించారు. వారితో పాటు 3 వ వార్డు కౌన్సిలర్ గంకటి శ్రీధర్ రెడ్డి, వార్డు బూత్ స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు ప్రజల గొంతుక - నిజం కోసం..

హైదరాబాద్
శుక్రవారం 26 జూన్ 2026



## ఆడబిడ్డ పెళ్లి కానుకగా ఆర్థిక సాయం అందజేత

**హుగ్గేల్లీ గ్రామ సర్పంచ్, పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి**

ఝరాసంగం, జూన్ 25 (వాయిస్ టుడే) : జహీరాబాద్ మండల పరిధిలోని హుగ్గేల్లీ గ్రామంలో సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి. మరోసారి తన మాట నిలబెట్టుకున్నారు.ఎన్నికల సమయంలో గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు గురువారం(శ్రీమతి సునీత–జైరాజ్) కుమార్తె దీపిక వివాహ నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి పెళ్లికానుకగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పట్లోళ్ళ.విమల శ్రీనివాస్ రెడ్డి. మాట్లాడుతూ గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు తన వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈసందర్భంగా వధువు కుటుంబ సభ్యులు తమ కుమార్తె పెళ్లికి సహాయం అందించిన సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి,గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు నర్సింహులు,బాల్ రాజ్, రాజశేఖర్, సిద్దారెడ్డి, మశ్చేందర్, రాములు, ఏసప్ప, ప్రేమ్, సంజీవ్ మరియు తదితరులు పాల్గొన్నారు.



## నూతన దంపతులను ఆశీర్వదించిన బాదావత్ బాలాజీ

**పాపకొల్లు గ్రామంలో ఘనంగా జరిగిన వివాహ మహోత్సవంలో పాల్గొన్న వైరా నియోజకవర్గ నాయకులు**

వైరా ప్రతినిధి (వాయిస్ టుడే) : జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన మాలోత్ నరసింహారావు (స్వామి) -- పద్మ దంపతుల కుమార్తె సౌజన్య, రవీందర్‌ల వివాహ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు వైరా నియోజకవర్గ నాయకులు బాదావత్ బాలాజీ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడింది. వివాహ వేడుకలో పాల్గొన్న బాదావత్ బాలాజీ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందమయం, సుఖసంతోషాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో కుటుంబ వ్యవస్థ విలువలను కాపాడే వివాహ బంధం పరస్పర అవగాహన, ప్రేమ, బాధ్యతలతో మరింత బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ బాదావత్ బుజ్జి సతీసమేతంగా హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వధూవరులు ఆయురారోగ్యాలతో సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. "సౌజన్య--రవీందర్‌ల దాంపత్య జీవితం సుఖశాంతులతో కొనసాగాలని, వారు కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నాం" అని బాదావత్ బాలాజీ అన్నారు. వివాహ వేడుకలో పలువురు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, బంధువులు పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా, సాదాసీదా వాతావరణంలో నిర్వహించబడింది.



## తొర్రూర్ డిపోను సుందర్శించిన డిప్యూటీ ఆర్ఎం

తొర్రూరు, జూన్ 25 వాయిస్ టుడే : టీజీఎస్ ఆర్టీసీలో సాధరన బదిలీల్లో భాగంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఆర్ఎం కిషన్ రావు గురువారం తొర్రూర్ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినందుకు గాను డిపో మేనేజర్ ప్రసన్న లక్ష్మి , ఎంఎఫ్ విజయ్ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. డిపో గ్యారేజ్ ఆవరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి టైర్ మైలేజీని పెంచడమే కాకుండా గ్యారేజ్ సిబ్బంది తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి డిపో అభివృద్ధికి సహకరించలన్నారు. అంతేకాకుండా గ్యారేజ్ సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు.డిపో మేనేజర్ ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో డిపో ఆవరణంలో మొక్కను నటించారు. తొర్రూరు డిపో మేనేజర్ ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ గతంలో మాదిరిగానే రీజియన్ లో మొదటి స్థానంలో తొర్రూర్ డిపోను నిలిపేందుకు ఉద్యోగులంతా తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తిసు డిపో అభివృద్ధికి సహకరించలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిలు, మెకానిక్ లు, శ్రామిక్ లు, తదిరులు పాల్గొన్నారు.

# హక్కులను హరించే చర్యలను విరమించాలి




సూర్యాపేట (వాయిస్ టుడే) : కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమం పేరుతో కోట్లాది మంది పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, దళితులు, మైనారిటీలు మరియు అట్టడుగు వర్గాల ఓటు హక్కులు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల జాబితాల్లో పేర్ల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలు పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం అమలు చేస్తున్న సర్ విధానం అనేక సందేహాలకు తావిస్తోందని అన్నారు.దేశంలోని పలు రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఈ ప్రక్రియలో అక్రమాలు జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు.

ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలనిసూచించారు.ప్రతి ఓటరికి తగిన సమాచారం అందించి, అభ్యంతరాలు తెలిపేందుకు తగినసమయంఇవ్వాలన్నారు. ప్రజల ఓటు హక్కును హరించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్ట రాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని గుర్తు చేశారు. అందువల్ల ఎన్నికల సంఘం రాజకీయ పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, ప్రజల్లో అనుమానాలకు తావులేకుండా సర్ ప్రక్రియను నిర్వహించాలని కోరారు.ఎన్నికల జాబితాల సవరణ పేరుతో ప్రజాస్వామ్య హక్కులపై దాడి జరిగితే సిపిఎం తీవ్రంగా ప్రతిఘటిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.



## ఐబీసీ ఛానల్ రిపోర్టర్ పాలకూరి శేఖర్ గౌడ్ కుటుంబానికి బి .ఆర్ .ఎస్ . 3 లక్షల ఆర్థిక సహాయం

నల్గొండ జూన్ 25(వాయిస్ టుడే ): తెలంగాణ ఉద్యమకారుడు, ఐబీసీ ఛానల్ రిపోర్టర్ పాలకూరి శేఖర్ గౌడ్ ఇటీవల ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే.పాలకూరి శేఖర్ గౌడ్ కుటుంబాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పరామర్శించి మూడు లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. నల్గొండ మండలం అన్నెపర్తి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఐబీసీ ఛానల్ రిపోర్టర్ పాలకూరి శేఖర్ గౌడ్ ఇటీవల ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పరామర్శించారు.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశానుసారం పార్టీ తరపున బాధిత కుటుంబానికి మూడు లక్షల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా శేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ముఖ్య మంత్రి , కె .టి .ఆర్ , మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తో పాటు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కి జర్నలిస్టు లు , జర్నలిస్ట్ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఐ బీసీ ఛానల్ మేనేజింగ్ డైరక్టర్ ఏచూరి భాస్కర్ , అన్నెపర్తి సర్పంచ్ మేకల పల్లవి అరవింద్ రెడ్డి , బి .ఆర్ . ఎస్ . నాయకులు కంచర్ల కృష్ణా రెడ్డి , రేగట్టే మల్లిఖార్జున్ రెడ్డి , బోనగిరి దేవేందర్ , కార్పొరేటర్ లు దొడ్డి రమేష్ , మారగోని భవాని గణేష్ ,రావుల శ్రీనివాస్ రెడ్డి , మృతుడు శేఖర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సర్వజన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి తుమ్మల



ఖమ్మం కమాన్ బజార్: ఖమ్మం సర్వజన ఆస్పత్రిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఓపీ విభాగాలను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం క్యాజువాలిటీ వద్ద సిబ్బంది పనితీరు, రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఔషధ విభాగం వద్ద బారులు తీరిన రోగులతో మాట్లాడి అన్ని రకాల మందులు ఇస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తూ వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రి ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. అత్యవసర బ్లాక్ భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి భవనాన్ని అప్పగించాలని ఇంజనీర్లను ఆదేశించారు. మంత్రి వెంట గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఆర్ఎంఓ రాంబాబు తదితరులున్నారు.

## డిసిసి బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్**




తొర్రూరు, జూన్ 25 వాయిస్ టుడే : గ్రామీణ ప్రాంత ప్రజలు డిసిసి బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్ రావు కోరారు. డిసిసిబి తొర్రూరు శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని డిసిసి బ్యాంక్ మేనేజర్ ఎం.పూర్ణచందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ప్రవేశపెట్టిన రాణి రుద్రమ డిపాజిట్ పథకం కింద ఖాతాదారులకు అత్యధికంగా 8.10 శాతం అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం దీర్ఘకాలిక రుణాలు బర్రెలు,గొర్రెలు, ట్రాక్టర్లు, కార్లు, హార్వెస్టర్లు కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయాలు, హౌసింగ్, ఎడ్యుకేషన్ లోన్లు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు, మహిళ సభ్యులకు లోన్లు వర్తిస్తుందన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో సులభతరం చేసేందుకు ఆన్ లైన్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, లాకర్ సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా లాంటి పథకాలు అందిస్తుందన్నారు. డిసిసి బ్యాంక్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అమ్మాపురం సర్పంచ్ ముద్దం సునీత వీరారెడ్డి, తొర్రూరు ఇన్చార్జి సీఈవో కె.శ్రీనివాస్,బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణ కాంత్, కళాజాత బృందం నిర్వాహకులు వై.రమేష్,బ్యాంకు సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జైభారత్ ఎస్సీ పోరాటవేదిక రాష్ట్ర అధ్యక్షునిగా వల్లూరి మధుమాదిగ



తొర్రూరు, జూన్ 25 వాయిస్ టుడే : జై భారత్ ఎస్సి పోరాట వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన వల్లూరి మధు మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఎల్బినగర్ లో ఈనెల 21న జరిగిన జైభారత్ సామాజిక విప్లవ రణభేరి తెలంగాణ రాష్ట్ర సమావేశంలో వల్లూరి మధు మాదిగను రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మధు మాదిగ మాట్లాడుతూ జై భారత్ ఉద్యమం పట్ల రాష్ట్రంలో ఉన్న ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎస్సీలకు ఎలాంటి అన్యాయం జరిగినా ముందుండి పోరాటం చేస్తానని అన్నారు. అంబేద్కర్, గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషిచేస్తా అన్నారు. తనమీద నమ్మకంతో తనఎన్నికకు సహకరించిన జై భారత్ జాతీయ నాయకులు విజయ విహారం రమణమూర్తి, రజిని, లోకనాథ్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

**సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నా**

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**





హనుమకొండ, (వాయిస్ టుడే) : అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప వరమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడడంలో సీఎం రిలీఫ్ ఫండ్ కీలక పాత్ర పోషిస్తోందని ఎంపీ పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.3,50,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఎంపీ కడియం కావ్య స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భరించడం చాలా కష్టసాధ్యమవుతుందని అన్నారు. అలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయ నిధి ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తోందని చెప్పారు. ముఖ్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందాల్సి వచ్చినప్పుడు లక్షల్లో ఖర్చు అవుతుండటంతో కుటుంబాలు అప్పుల పాలయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అలాంటి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని..అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని ఎంపీ తెలిపారు. అవసరమైన సహాయం కోసం ప్రజలు ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. కష్టకాలంలో తమకు ఆర్థిక చేయూత అందేలా చొరవ చూపిన ఎంపీ కడియం కావ్యకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**